# పారిపోయిన పెండ్లికొడుకు

ఇందులో వొచ్చే వ్యక్తులు:

శివకామయ్య

సుభద్రమ్మ: అతని భార్య.

రామారావు: అతని కొడుకు.

నాగేంద్రం: పారిపోయిన పెళ్లి కొడుకు; సబ్ ఇనస్పెక్టరూ, ఇద్దరు పోలీసులూ.

స్థలం: శివకామయ్య అద్దెకున్న భాగంలో ఇంటివసారా.

కాలం: వర్తమానం.

[శివకామయ్య అద్దెకున్న భాగంలో ఇంటి వసారా. కుడిప్రక్కగా బజారుకు వాకిలి. ఎడమప్రక్కగా ఇంట్లోకి ద్వారం. వసారా గోడ మధ్యలో చిన్న అలమర. గోడకు ఒక క్యాలెండరూ, రెండుమూడు ప్రకృతికి సంబంధించిన చిత్రపటాలూ తగిలించి ఉంటాయి. వసారాలో ఒక చిన్న డ్రాయరూ, రెండు కుర్చీలూ, వాటికి కొంచం దూరంగా పడకకుర్చీ ఉంటాయి.

తెర లేచేప్పటికి శివకామయ్య పత్రిక చదువుకుంటూ వుంటాడు. వయస్సు యాభై పైచిలుకు. బస్తీలో కాపురముంటున్న రైతు పోలికలు. కొడుక్కు ఉద్యోగం కావటం మూలాన బస్తీలో ఉంటున్నాడు.

సుభద్రమ్మ అప్పుడే వంటపని ముగించుకొనివచ్చి పత్రిక వార్తలు వినేందుకు భర్త చెంత క్రింద చతికిలపడుతుంది, బద్ధకంగా. కాస్త-లావుపాటి మనిషి. వయస్సు నలభైఅయిదుకు పైపెచ్చు. ఆమె మెడలో నల్లపూసల గొలుసు, చేతులకు రెండుజతల గాజులు తప్ప వేరే అలంకరణ ఏమీలేదు.

రామారావు వస్తాడు, కొంచం ధూకుడుగా. ముఖంలో సరిగ్గా వ్యక్తంకాని ఏదో సంతోషం. ఆదివారం కావటంచాత ఆఫీసుకు వెళ్ళలేదు. నవయువకుడు. షర్టూ, పైజామా, కళ్ళకుజోడు. అతని ప్రక్కనే ఎవరో ఒక ఇరవైఏళ్ల యువకుడు కూడా వుంటాడు. అర్థంకాని చూపులు చూస్తూ వింతగా వుంటాడు. మాసిన గుడ్డలు. చెదరిన జుట్టు. కాంతి తగ్గిన ముఖం. లోకానికి అర్థంకాని శిల్పిలాగా, మతిచెడిన వివేకిలాగా వుంటాడు. శివకామయ్యా, సుభద్రమ్మా రెండు నిముషాల పాటు ఆశ్చర్యంగా ఆ వ్యక్తికేసి చూస్తారు. అతను అదేమీ గమనించక తన పిచ్చిలో తాను వున్నట్టు అగపడతాడు.]

రామారావు: ఏమిటే అమ్మా, అట్లా చూస్తారు? ఎవరనుకొన్నారూ? (కొంచం ఆగి) పోల్చుకోండి?

శివ: ఏం పోల్చుకోమంటావు? ఇది వరకు ఎప్పుడైనా చూస్తేనా! ఏమేఁ, నీకేమైనా గుర్తులు తగిలేయా?

సుభద్రమ్మ: ప్చ!

**శ్రీ తాళ్ళూరి**

**నాగేశ్వరరావు**

రామారావు: (నవ్వుతూ) ఎవ్వరూ కనుక్కోలేరు. మరి ఎట్లా కనుక్కుంటారు? రూపం చాలవరకు మారిపోయిందాయె. నాలుగుసంవత్సరాలక్రితం కనపడిన మనిషి. ఎన్నిమార్పులు జరక్క ఏముంది?

ఆ వ్యక్తి: (ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ వుంటాడు. శివకామయ్యా, సుభద్రమ్మ నిశితంగా చూస్తారు, ఒక నిముషం సేపు)

శివకామయ్య: చెప్పరాబాబూ! నాన్చి నాన్చి చంపక! ఆలోచిస్తే అంతుపట్టక పోకు. ఎందుకని గానీ—

సు: ఆఁ! అవును. గుర్తు తగిలింది. నాలుగేళ్లక్రితం......జ్ఞాపకం లేదండీ! మన వెంకట్రామయ్య కొడుకు, పెళ్లికేపనగా పారిపోలేదుటండీ! ఆ అబ్బాయి లాగా...

రా: రైటో...కచ్చితంగా చెప్పావు, అమ్మా! నాన్న ఆ మాత్రం గుర్తుపట్టలేక పోయాడు. ఎట్లా అయినా ఆడవాళ్ళకి జ్ఞాపకశక్తి జాస్తి. అందులో వయస్సు మళ్ళినవాళ్ళకి మరీన్నూ.

శి: (ఆకస్మికంగా వొచ్చిన సంతోషం కనబరుస్తూ) ఓరి - నువ్వట్రా. నోట్లో ఆడుతున్నది కానీ సమయానికి బయటికి రాలేకపోయింది. నీపేరు నాగేంద్రం కాదబ్బాయ్! - అవును. నాగేంద్రమే! మీ నాయనమ్మ రోజూ నాగేంద్రుడు కలలో కనబడుతున్నాడని చెప్పి, ఆపేరు ముద్దుగా పెట్టుకుంది. ఎంతవాడివయ్యావురా! నిన్ను ఇంతప్పట్నుంచీ నేను ఎరుగుదును. చాల తెలివైనవాడివి. నీ తెలివికి ఆరోజుల్లో మేమందరం మురుసుకొనేవాళ్ళం. మా రాముడు కూడా పనికి వచ్చేవాడుకాదు.

సు: అయితే అబ్బాయీ! ఈ నాలుగేళ్ళనుంచి ఎక్కడ వుంటూన్నట్టు.

నాగేంద్రం: (మాట్లాడడు. పిచ్చిగా చూస్తూవుంటాడు, వినిపించుకోనట్టు?

శి: వాడితీరే అంత. వాడి మన తత్వం మనకు తెలియనిదా! నాలిముచ్చులాగా వుంటాడు. అందరూ అమాయకుడు అనుకుంటారు. కాని వాడిలో బ్రహ్మాండమైన తెలివితేటలు వున్నాయి. చదువు విషయం చూడరాదూ! పదిహేను ఏళ్లు వచ్చేప్పటికి స్కూలుఫైనలు ఒక్క దెబ్బను ప్యాసయ్యాడు. పైకి ఎట్లా వుంటేనేం!

రా: ఏమైనా వాడిలో చాలా మార్పులు వొచ్చినయ్. నా వెంట ఇంత దూరంవచ్చాడా - నాతో ఒక్కమాట మాట్లాడితో ఒట్టు. 'ఊఁ! 'ఆఁ! అంటాడు, నోరు తెరచిమాట్లాడడు. కాఫీ తాగిహోటలు బయటికి వచ్చేప్పటికి చెట్టుక్రింద నిల్చొని ఎవరికోసమో నిరీక్షిస్తున్నాడు. నేను మొదట్లో గుర్తుపట్టలేదు. తరువాత తరువాత తీక్షణంగా చూసేప్పటికి గుర్తుపట్టగలిగాను దగ్గర కెళ్ళి 'ఎక్కడుంటున్నావు?' అనేప్పటికి ముసిముసినవ్వులు నవ్వుకోవటం ఆరంభించాడు. 'ఇంటికొస్తావా?' అన్నాను. మాట్లాడలేదు. 'ఊఁ!' అనలేదు. మళ్ళి రెట్టించి అడిగేటప్పటికి ఏమనుకొన్నాడో ఏమో, వెంటబడి చక్కా వచ్చాడు.

సు: మతి చెడింది కాబోలు.

రా: కాబోలేమిటి? తప్పకుండా చెడింది. కొన్నాళ్ళపాటు మందు తింటే కానీ అబ్బాయి సరైన దారిలోకి రాడు. అసలు ఇంతకూ కారణం ఆ పెళ్లే. మ

 

వెంకట్రామయ్య అంత మూర్ఖంగా ప్రవర్తించాడేం?

నా: (ఈ సంభాషణ తనకు నచ్చనట్టు పెడముఖం పెట్టి శూన్యంలోకి చూస్తూ వుంటాడు.)

శివ: తప్పలేదు. పరిస్థితులకు తల వంచవలసివచ్చింది. ఆ వూళ్లో వెంకటనారాయణ అంటే అంగుళం మందాన ఖ్యాతి ఉంది. అటువంటివాడు పిలిచి పిల్ల నిస్తానంటే, పైపెచ్చు బాగా కట్నం యిచ్చి - పెళ్ళి చేసుకోవటానికేం? పిల్ల నలుపైతే మటుకు సంబంధాన్ని కాదనటమే! అసలు కీలకం ఎక్కడున్నదంటే, ఇటువంటి సంబంధాన్ని చేసుకోకపోతే రేపు ఊళ్లోవాళ్ళు వెంకట్రామయ్యను వూరుకుంటారా? 'ఇంతకన్నా గొప్పసంబంధాన్ని చేస్తావా?' అంటారు. ఏమని సమాధానం చెప్పేట్టు? సగం అందుకు దడిసి వెంకట్రామయ్య కొడుకుని చేసుకుంటే తప్పేమీ లేదని గట్టి పట్టుబట్టాడు. చివరకు కొడుకు ఇష్టం లేకపోయినా ముహూర్తం పెట్టుకొచ్చాడు. ఏం లాభం? పిల్లవాడు పారిపొయ్యాడు. అప్రదిష్టని గుండె బాదుకున్నాడు, వెంకట్రామయ్య.

సు: ఎంత చదువుకొంటే ఏం, తలిదండ్రులకు చెడ్డపేరు తెచ్చాడు.

రా: ఏం చెడ్డపేరులే! మరి ఇష్టం లేని సంబంధాన్ని కట్టబెట్టడమేమిటి? నా మటుకు నన్నడిగితే మంచిపని చేశాడని చెబుతాను. కాని అట్లా పారిపోయేకంటె ఎదిరించి పోట్లాడి తన పంతం నెగ్గించుకొంటే బాగుండేది.

శివ: గుండె-చెరువా? వెంకట్రామయ్య తరహా పూర్తిగా నీకు తెలీనట్లుంది. యమకింకరుడే!

రా: అమ్మా! ముందు నాగేంద్రానికి అన్నం వడ్డించవే! ఎప్పుడు తిన్నాడో ఏమో!

సు: (ఆప్యాయంగా) రా, అబ్బాయ్! రా! రోజూ అన్నం ఎక్కడ తింటున్నావో ఏమో! చూడు, ఎట్లా చిక్కిపోయావో! పోలికలే చాలా మారినయ్.

[సుభద్రమ్మ వెళుతుంది ఇంట్లోకి]

శివ: పోరా, అబ్బాయ్, నాగేంద్రం!

[నాగేంద్రం తన ఆలోచనలనుంచి చటుక్కున మేలుకొన్నవాడై, ఇంట్లోకి వెళతాడు.]

శివ: రామారావ్! వెంకట్రామయ్యకు ఒక ఉత్తరంముక్క రాయి. నాగేంద్రం దొరికాడని. వచ్చి తీసుకెళతాడు.

రా: వ్రాస్తాను.

శి: పాపం! వాళ్ళు కుర్రవాడిమీద ఆశ వొదులుకున్నారు. ఒక సంవత్సరమంతా చూచినచోట చూడకుండా వెతికారు. చివరకు పేపర్లోకూడా ప్రకటించారు, పట్టియిచ్చినవారికి వెయ్యి రూపాయల బహుమతి యిస్తామని. ఇప్పుడు పట్టియిచ్చినా కళ్ళకద్దుకొని వెయ్యి రూపాయలు ఇచ్చేందుకు సంసిద్ధుడై ఉన్నాడు. దేనికి వెయ్యిరూపాయలు నష్టపెట్టటం - మనం కొస్త ఉత్తరంముక్క వ్రాస్తేసరి. మరుసటిరోజుకల్లా వచ్చేస్తాడు. పైకి కొడుకుమీద అంత కర్కశంగా వుంటాడు కానీ, వెంకట్రామయ్యకు ఎంత ప్రేమనీ.

రా: సరే, ఇప్పుడే రాస్తాను నాన్నా!

[లోపలకువెళ్లి కార్డూ, వొత్తుకి ఒక పుస్తకమూ పట్టుకొచ్చి]

ఏమని రాయమంటావు, నాన్నా!

శి: ఇంకా రాసేదేముంది, ఉన్న విషయమే రాయి.

[రామారావు గబగబా రాసి, పైకి చదువుతాడు.]

రా: మహారాజశ్రీ, వెంకట్రామయ్య బాబాయిగారికి రామారావు వ్రాయునది ఏమనగా - నాలుగు సంవత్సరముల క్రితం పెళ్లి రేపనగా - ఇష్టంలేక పారిపోయిన మీ కుమారుడు నాగేంద్రం నిన్న ఇక్కడ కనిపించాడు. నేను ఇంటికి తీసుకువచ్చి అట్టే పెట్టినాను. ఈ ఉత్తరం చూచిన తక్షణం వచ్చి తీసుకు వెళ్లవలసింది. ఇక్కడ అంతా క్షేమం.

శి: బాగుంది. అంతే! ఇంకా వ్రాయవలసిందిమటుకు ఏముంది?

[బయటనుంచి 'ఎవరండీ లోపల. తలుపు. తలుపు తెరవండి' అన్న కేకలు వినవస్తాయి]

శి: ఎవరదీ?

(బయటనుంచి తలుపు తెరవమని మళ్ళీ కేకలు, రామారావు వెళ్ళి తలుపు తీస్తాడు. సబ్ ఇనస్పెక్టరూ, ఇద్దరు పోలీసులూ దూకుడుగా వస్తారు. శివకామయ్యా, రామారావు నిశ్చేష్టులవుతారు)

సబ్ ఇనస్పెక్టరు: వి. రామారావు గారి ఇల్లు ఇదేనా!

రా: (నిశ్చేష్టుడై మాట్లాడడు)

శివ: (కొంచం తేరుకొని) ఎందుకు?

సబ్: (జేబులోంచి కాగితం తీసి చూస్తూ) మీ ఇంట్లోకి నాగేంద్రం అనే దొంగ వచ్చినట్టు తెలియవచ్చింది.

రా: దొంగా? నాగేంద్రమా?

పోలీస్: అవును.

శివ: నాగేంద్రం అనే దొంగ మా ఇంట్లోకి ఎవ్వరూ రాలేదు.

సబ్: (అధికారాన్ని వ్యక్తం చేస్తూ) అయితే మీ ఇల్లు సోదా జరపవలసి ఉంటుంది.

రా: ఏం దొంగిలించాడు?

పో: సావుకారు వెంకటసుబ్బయ్య గారింట్లో నెక్లెస్ దొంగించాడు.

శివ: ఎట్లా దొంగిలించాడు.

సబ్: (రాయిగుద్దినట్టు) అదంతా మీకు అనవసరం. తొలగండి ఇల్లుసోదా చేయాలి. ఆర్డర్సు ఇవిగో. (చేతిలోని కాగితం చూపిస్తాడు. నాగేంద్రం ఫొటోకూడా చూపిస్తాడు. పోలిక ఒకటే, అయేప్పటికి శివకామయ్యకూ, రామారావుకీ చెమట్లు పడతాయి. ఒకళ్లముఖం ఒకళ్లు తేరి పార చూసుకుంటూ ఉంటారు) సోదా చూడనివ్వకపోతే మీరుకూడా ఈ కేసులో ఇరుక్కోవల్సి వస్తుంది అది గమనించండి.

(ఇంతలో నాగేంద్రం ఇంట్లోంచి బయటికొస్తాడు. సబ్ ఇనస్పెక్టర్నీ, పోలీసుల్నీ చూసేప్పటికి ఎందుకో నాగేంద్రం వొణికిపోతాడు. శివకామయ్యకూ, రామారావుకూ, 'వీడు వెంకట్రామయ్యకొడుకు నాగేంద్రం కాదేమో' అన్న సందేహం కలుగుతుంది.)

సబ్: మిస్టర్ నాగేంద్రం. నిన్ను అరెస్టుచేస్తున్నాము.

(నాగేంద్రం పిచ్చిగా చూస్తాడు. పారిపోవాలని చూస్తున్నట్టు చూస్తుంటాడు)

ఏమిటా చూపులు, నడువ్ ముందుకు.

(ఇద్దరి పోలీసులు మధ్య, సబ్ ఇన్స్పెక్టరు వెనుకా నాగేంద్రం బయటికి వెళతాడు. అప్పుడే ఇంట్లోంచి సుభద్రమ్మ హడావుడిగా వస్తుంది.)

సు: (ఏమీ అర్థంకాక) ఏమిటి? ఏమిటా విపరీతం? ఎందుకు పోలీసులు పట్టుకెళుతున్నారు.

శి: వాడు వెంకట్రామయ్య కొడుకు నాగేంద్రం కాడు. ఎవడో పచ్చిదొంగ.

రా: వాడి వాలకం చూస్తున్నకొద్దీ నాకు మొదట్నుంచీ కొస్తోకొస్తో అనుమానంగానే ఉంది. మన నాగేంద్రం అయితే అంత నటన చేయగలడా?

శి: ఎంత మోసం?

సు: సుష్టుగా అన్నంకూడా తిన్నాడు. ఈ సంగతి తెలిస్తే అపళంగా గరిటెతో నెత్తిమీద వేద్దును.

శి: మరీ లోకం మోసాలతో నడుస్తోంది.

[తెర జారుతుంది]

## 2

[అంతా మొదటి రంగంలో లాగే ఉంటుంది. శివకామయ్యా నవారు మంచం మీద పడుకొని ఏదో ప్రబంధం చదువుకుంటూ వుంటాడు. సుభద్రమ్మ పోకసంచి కుట్టుకుంటూ ఉంటుంది. సమయం మధ్యాహ్నం.]



"డాక్టరుగారూ! మా చెడ్డపడిశెం పట్టేసింది. ఎలాగైనా దీన్ని మాన్పిద్దురూ?"

"పడిశమా?...ఐతే ఒక పని చేయండి సరాసరి యింటికెళ్లిపోయి చన్నీళ్లతో బాగా ఒక గంటసేపు స్నానం చెయ్యండి."

"స్నానం చేస్తే పడిశెం తగ్గుతుందా అండీ?"

"స్నానం చేస్తే పడిశెం తగ్గదు కానీ, మీకు వెంటనే నిమోనియా వచ్చేస్తుంది. అదైతే యిట్టే కుదిర్చేస్తాను."

# ★ పారిపోయిన పెండ్లికొడుకు ★

సుభ: అబ్బాయి నిన్ననగా వెళ్ళాడు ఇంకా రాలేదేం?

[శివకామయ్య మాట్లాడడు. ధ్యానంలో మునిగి, ఏదో అసందర్భంగా చిరునవ్వు నవ్వుకుంటూ వుంటాడు.]

సు: (పెద్దగా) ఏమండోయ్.

శి: (ఉలిక్కిపడి) ఏమిటే?

సు: మన అబ్బాయి, ఇంకా రాలేదేం?

శి: వస్తాడు. అక్కడ ఏం జరిగిందో.

సు: జరగటానికి ఏముంది? వాడు వెంకట్రామయ్య కొడుకు నాగేంద్రం కాడు.

శి: అబ్బాయి వెళ్ళాడుగా. కనుక్కొని వస్తాడుగా. ఈపాటికి రావాల్సిందే. ఎందుకని రాలేదో!

సు: జైల్లో వేసి ఉంటారు. వెంకట్రామయ్యను జైలుదగ్గరకు తీసుకెళ్ళి చూపించితే సరి మనవాడైతే ఏదోవిధంగా విడిపించుకు వస్తారు. లేకపోతే మెదలకుండా ఊరుకుంటారు.

శి: మనవాడు అయివుండడు. మన నాగేంద్రం ఇంత పిచ్చివాడెంగా? ఎప్పటికీ కాడు. వాడి మన స్తత్వం నాకు బాగా తెలుసు. వాడు ఇంతగా మారిపోయాడంటే నేను నమ్మను.

[మళ్ళీ తన ప్రబంధం చదువుకోవటంలో మునిగిపోతాడు.]

సు: కూటికి గతిలేనప్పుడు దొంగతనాలు చేయక తప్పుతుందా?

[భర్త మాట్లాడకపోయేటప్పటికి తన పనిలో తాను నిమగ్న మవుతుంది, సుభద్రమ్మ. ఒక నిముషం నిశ్శబ్దంలో గడుస్తుంది. 'అమ్మా తలుపు తీయవే' అని బయటినుంచి రామారావు కేక. సుభద్రమ్మ దిగ్గున లేచివెళ్లి తలుపు తీస్తుంది రామారావు లోపలకు వస్తాడు.]

సు: ఇంత ఎర్రనగిలో రాకపోతే కాస్త చల్లబడిం తరువాత రాకపోయినావా? అంత ముంచుకుపోయింది ఏముందీ?

[రామారావు చెమట తుడుచుకుంటూ వుంటాడు.]

సు: మంచినీళ్లు తీసుకువచ్చేదా?

రా: తీసుకురా!

[సుభద్రమ్మ లోపలకువెళ్ళి మంచినీళ్లు వెండిగ్లాసుతో తీసుకువచ్చి ఇస్తుంది.]

శి: వెళ్లినపని ఏమైందిరా. వెంకట్రామయ్యకు చూపించావా?

రా: (నవ్వుతూ) మనకు టోపీ వేశారే!

సుభ: } (ఒక్కసారిగా) ఎవరూ?
శివ: }

రా: మనం చాలా పొరపాటు పడ్డాం.

శి: ఏమిటి?

రా: నేను ఇంటికి తీసుకువచ్చిన నాగేంద్రం మన నాగేంద్రమే; మనం తెలుసుకోలేకపోయాం.

సు: జైల్లో వెంకట్రామయ్య కూడా గుర్తు పట్టాడన్నమాట.

శివ: మరి ఎట్లా విడిపించుకొచ్చారు?

రా: బిగ్గరగా (నవ్వి) జైలేమిటి? విడిపించుకొని రావటమేమిటి?

సు: జైల్లో వేయలేదట్రా.

రా: (నవ్వు ఆపుకొని) వాళ్లు సబ్ ఇనస్పెక్టరూ, పోలీసులూ కాదు. మనదగ్గరకు వేషాలు వేసుకొచ్చారు. పోకిరీగా తిరిగే వెధవాయిలు. నాగేంద్రాన్ని ఆపకంగా వెంకట్రామయ్యగారి దగ్గరకు తీసుకువెళ్ళారట. ఆయన మెచ్చి వెయ్యి నూటపదహార్లు ఇచ్చి పంపించాడట, నాగేంద్రం వచ్చాడు, అంతే చాలు అనుకొని.

శివ: } ఆఁ! అంతపని జరిగిందీ!
సుభ: }

(తెర వాలుతుంది)